క్లుప్తంగా

ఉచిత పశువైద్య శిబిరం

కె.గంగవరం: పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీసీఎంస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్ సూచించారు. బాలాంత్రం గ్రామంలో శుక్రవారం పేకేరు పశువైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్టా శ్రీనివాస్ మాట్లాడుతూ పాడి రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1962 నంబర్‌కు ఫోన్ చేసి వైద్య సేవలు పొందాలన్నారు. అనంతరం గ్రామంలోని 62 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ తోలేటి కృష్ణ, పశువైద్యులు సురేష్, ఎం.కృష్ణార్జున్ పాల్గొన్నారు.

క్షేత్ర పరిస్థితులపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిస్థితులపై సచివాలయ ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి అన్నారు. కపిలేశ్వరపురంలోని సచివాలయాలను ఆమె సందర్శించి ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, సాంకేతిక యాప్‌ల వినియోగంపై ఆమె ఉద్యోగులతో మాట్లాడారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఉన్నారు.

డీవైఈఓకు అభినందనలు

రామచంద్రపురం: రామచంద్రపురం డీవైఈఓగా బాధ్యతలు స్వీకరించిన పి.సాల్మన్‌రాజుకు శుక్రవారం పలువురు అభినందనలు తెలిపారు. ఇప్పటివరకూ ఇక్కడ డీవైఈఓగా పనిచేసిన విద్యాసాగర్ ఏలూరు విద్యాశాఖాధికారిగా బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో అమలాపురం డీవైఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సాల్మన్‌రాజు ప్రభుత్వ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీవైఈఓగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా హెచ్‌ఎంల సంఘం నాయకులు పోలిశెట్టి రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, పీఆర్‌టీయూ సంఘం నాయకులు తిలక్‌బాబు, న్యాయవాదులు దొమ్మలపాటి సత్యనారాయణ, పలివెల సత్యనారాయణ తదితరులు డీవైఈఓను కలిసి అభినందనలు తెలిపారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పృథ్వీరాజ్, భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలో వేంచేసి ఉన్న రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా దేవతామూర్తులను వేద పండితులు రథంపై ఉంచి విశేషంగా అలంకరించారు. రథోత్సవాన్ని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కట్టా రామచంద్రరావు, సభ్యులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ హాజరై రథాన్ని లాగారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రధాన రహదారుల మీదుగా పోలేరమ్మ ఆలయం వరకూ రథోత్సవం సాగింది. అమ్మవారి ఆలయం వద్ద తీర్థం నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ఆకెళ్ల ఎస్‌బీజీ రామలింగం, ఆలయ మాజీ చైర్మన్ యర్రా వీరన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతోనే ఆరోగ్యం



మండపేటలో ర్యాలీ చేస్తున్న పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు

మండపేట: మాంసాహారాన్ని వీడి ప్రతి ఒక్కరూ శాకాహారం తినడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి అన్నారు. మండపేట బ్యాంకు కాలనీలో కొనగళ్ల సత్యనారాయణ, విజయకుమారి పిరమిడ్ ధ్యాన మందిరం 15వ వార్షికోత్సవం సందర్భంగా మండపేట, పరిసర గ్రామాలకు చెందిన పత్రీజీ అభిమానులు శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ బ్రహ్మర్షి పత్రీజీ చూపిన ధ్యాన మార్గాన్ని నేడు ప్రపంచ దేశాల్లో ఎందరో ఆచరిస్తూ జీవిత పరమార్థాన్ని తెలుసుకుంటున్నారన్నారు. మూగజీవాలను చంపి తినే హక్కు మనిషికి లేదని, జంతు సామ్రాజ్యాన్ని స్వేచ్ఛగా బతకనీయడమే నిజమైన మానవతా ధర్మమని అన్నారు. శాకాహారం విశిష్టతను వివరిస్తూ మెయిన్‌రోడ్డు, కేపీ రోడ్డు, రాజారత్న బైపాస్ రోడ్డుల మీదుగా ర్యాలీ నిర్వహించారు.

బాలయోగికి ఘన నివాళి

రామచంద్రపురం: దివంగత మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతిని శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బాలయోగి చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్పీకర్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, కొత్తపల్లి శ్రీనివాసరావు, కొసనా శ్రీనివాసరావు, పంపన శ్రీను పాల్గొన్నారు.

భరోసానిచ్చే సాయం

- లబ్ధిదారులకు వైఎస్సార్ రైతు భరోసా జమ
- క్లస్టర్ పరిధిలో 44,009 మందికి లబ్ధి
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



చిరుపొట్ట దశలో ఉన్న వరి పైరు

రాయవరం: పొలం బాట పట్టిన పుడమి పుత్రులకు సిరులు పంట కురుస్తోంది.. వ్యవసాయం దండగ కాదు.. పండుగ చేసి చూపిస్తానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో రైతులతో చేసిన బాసలు నేడు వాస్తవ రూపం దాల్చుతున్నాయి. ఆరుగాలం కష్టించి పంట పండించే అన్నదాతలకు ప్రభుత్వం చేదోడు వాదోడుగా నిలుస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ యోజన కింద అందించే ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం జమ చేసింది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల్లో రైతుల ఖాతాల్లో సొమ్మును వేశారు. వైఎస్సార్ రైతు భరోసా సాయం నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుండడంతో వారి ఆనందానికి అవధులు లేవు.

పెట్టుబడి సమయంలో..

ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశకు చేరింది. రబీ సాగు పెట్టుబడుల కోసం రైతులు గతంలో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేవారు. ఇప్పుడు ఆ అవసరం లేకుండా పెట్టుబడి సమయంలో ప్రభుత్వం కర్షకులకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న తరుణంలో రైతుల ఖాతాల్లో ప్రభుత్వ సాయం జమ కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతు ఒక్కొక్కరికి రూ.2 వేలు జమ చేయగా, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రైతులకు రూ.2 వేలు జమ చేసింది.

క్లస్టర్ పరిధిలో పరిశీలిస్తే..

మండపేట నియోజకవర్గం మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల పరిధిలో వైఎస్సార్ రైతు భరోసా కింద 1,842 మందికి రూ.72,70,500, రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పరిధిలో 1,981 మంది కౌలు రైతులకు రూ.93,05,500 నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. పీఎం కిసాన్ పథకం కింద మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల పరిధిలోని 21,635 మంది రైతులకు రూ.4,76,11,928, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన రూ.18,551 మంది రైతులకు రూ.4,08,25,000 నగదు అందించారు. రెండు నియోజకవర్గాల పరిధిలో రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం కింద 3,823 మంది కౌలు రైతులకు రూ.1,65,76,000, పీఎం కిసాన్ పథకం కింద 40,186 మంది రైతులకు రూ.8,84,36,928 నగదు ఇచ్చారు. సరైన సమయంలో అందించిన ఆర్థిక సాయం పెట్టుబడికి మదుపుగా మారుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం అందించిన సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని సాగులో మంచి ఫలితాలు సాధించాలి. ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశకు చేరుతుంది. పంటలకు పెట్టుబడి పెట్టాల్సిన తరుణంలో ప్రభుత్వం సాయం అందించడంతో అప్పులు చేయాల్సిన పని ఉండదు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

పెట్టుబడికి ఉపకరిస్తుంది



రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సాయం అందిస్తోంది. మా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా రబీలో పెట్టుబడికి ఉపకరిస్తుంది.

– మేడిశెట్టి వెంకటరమణ, కౌలురైతు, వెంటూరు

కన్నుల పండువగా అగస్త్యేశ్వరుని కల్యాణం



స్వామివార్ల కల్యాణ వేడుకను తిలకిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, భక్తులు

మండపేట: స్థానిక రథం గుడిలో వేంచేసి ఉన్న అగస్త్యేశ్వర కైలాసేశ్వర, సర్వేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవం శుక్రవారం తెల్లవారు జామున కన్నుల పండువగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కల్యాణ వేడుకల్లో భాగంగా ఆలయ అర్చకుడు అయినవల్లి సూర్యసుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో నిత్యోపాసన, బలిహరణ పూజలు జరిగాయి.

నేడు మహిళా సదస్సు

కె.గంగవరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కె.గంగవరంలో మహిళా సదస్సు నిర్వహించనున్నట్లు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వి.భీమశంకరం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలుర వసతి గృహం పక్కనే ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఉదయం 10.30 సదస్సు ప్రారంభమవుతుందన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

మండపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకు అనుగుణంగా విద్యాశాఖ అధికారులు పనిచేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం రాత్రి ఆయన ద్వారపూడి శివారు వేములపల్లిలోని బాలుర ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థి ఇంగ్లిష్ వర్క్‌బుక్‌ను పరిశీలించగా ఖాళీగా ఉండటాన్ని ఆయన గుర్తించారు. వర్క్‌బుక్‌లో విద్యార్థులతో వర్క్స్ చేయించకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. విద్యార్థుల ప్రగతి కోసం రూ.కోట్లు వెచ్చించి అందించిన వర్క్‌బుక్స్‌ను వారితో పూర్తి చేయించకపోతే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతుందని మండిపడ్డారు. అకౌంటబులిటీ అన్ని స్థాయిలో నిర్ణయించబడిందని, అందుకు అనుగుణంగా అధికారులు పనితీరును మెరుగుపర్చుకోవాలని ప్రవీణ్ ప్రకాష్ సూచించారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపడకపోవడాన్ని తన పర్యటనలో గుర్తించానన్నారు. మీ పరిశీలనలో కనుగొన్న లోపాలపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. ఉదాసీనంగా వ్యవహరిస్తే సహించేది లేదని, జవాబుదారీగా పనిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఆర్జేడీ జి.నాగమణిని ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశించారు. డీఈఓలు ఎస్.అబ్రహం, కేఎస్‌ఎస్‌వీ అన్నపూర్ణ, ఎం.కమలకుమారి, డీవైఈఓ షాలెంరాజు, ఎంఈఓ ఎస్.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు ప్రాధాన్యం



సూర్యనారాయణను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు తదితరులు

మండపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో బీసీలకు తగిన ప్రాధాన్యం ఇస్తుందని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ అన్నారు. ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సూర్యనారాయణ మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా తనకు పదవి రావడంలో త్రిమూర్తులు చేసిన కృషి మరువలేనని ఆయన పేర్కొన్నారు. ఆయనతో తనకు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. తాను రాజకీయాలకు దూరంగా ఉంటున్న సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం పట్ల ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. తోట మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సూర్యనారాయణ అంటే అందరికీ ఎనలేని గౌరవమన్నారు. ఆయన తాతయ్య సూర్యనారాయణ ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా సేవలందించగా, తండ్రి గోపాలకృష్ణ పోలీస్ శాఖలో ఐజీ స్థాయిలో పనిచేశారన్నారు. వారి బాటలోనే ఎమ్మెల్సీ సూర్యనారాయణ పేదల అభ్యున్నతికి పాటుపడతారని అన్నారు. ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, మేడిశెట్టి సత్యవేణి, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, జంగం కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, కపిలేశ్వరపురం మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చేసిన పుణ్యాలే మనతో వస్తాయి



రాయవరంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: మనతో బ్యాంకు బ్యాలెన్స్‌లు రావని, చేసిన పాపపుణ్యాలే మన వెనుక వస్తాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రాయవరంలోని వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో దాతల విరాళాలు రూ. 20 లక్షలతో చేసిన అభివృద్ధి పనులను శుక్రవారం ఎమ్మెల్సీ ప్రారంభించారు. అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు అందించిన సహకారం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో మంచి పనులు చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న చైర్మన్ శ్రీనివాసరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. తొలుత ఎమ్మెల్సీకి ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, పార్టీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, కేవీఆర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ తేతలి నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా

మండపేట: పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.కృష్ణవేణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక కలువపువ్వు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య, పేద వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మూడేళ్ల కిందట రూ.417 ఉన్న డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్ ధర ప్రస్తుతం రూ.1,155కు చేరిందన్నారు. పేదల సబ్సిడీలకు మోదీ సర్కారు కోత పెడుతూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందని విమర్శించారు. సీఐటీయూ నాయకులు రాణి, దేవి, కుమారి, నరేంద్రకుమార్, రాజు, కొండ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈశాన్య రాష్ట్రాల్లో గెలుపుపై బీజేపీ శ్రేణుల హర్షం

రామచంద్రపురం రూరల్: ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంపై ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల శంకరనారాయణ, మండల అధ్యక్షుడు అకేటి శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శి వెన్నపు ధనరాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని ద్రాక్షారామలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు హిండెన్ బర్గ్ వంటి సంస్థ ఇచ్చిన తప్పుడు సమాచారంతో ఎంతగా బురద జల్లాలని చూసినా మోదీ అభివృద్ధి మంత్రం ముందు నిలవలేదని అన్నారు. బీజేపీ నాయకులు పెయ్యల రాంబాబు, అల్లం రామకృష్ణ, గెద్దాడ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మండపేటలో సంబరాలు

మండపేట: ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల మండపేటలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం వేడుకలు జరుపుకొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనకు ఆకర్షితులై ప్రజలు విజయాన్ని అందించారని పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక కలువపువ్వు సెంటర్‌లో స్వీట్లు పంచి, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నాయకులు గొడవర్తి రామచంద్రరావు చౌదరి, కేశవరం సూర్యనారాయణ, నాళం ఫణిప్రకాష్, బుద్ధవరపు రాజు, రావూరి బాబూరావు, శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

కాజులూరు: మండలంలోని జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను ఉగాది నాటికి నూరు శాతం పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీడీఓ సీహెచ్ ఇందిరాదేవి అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కార్యదర్శులతో గృహ నిర్మాణాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. లబ్ధిదారులు వేగంగా గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా చూడాలన్నారు. అలాగే గ్రామాల్లోని ప్రభుత్వ భవనాలు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పి.శ్రీనివాసు, పంచాయతీరాజ్ ఏఈ రమ్యంత్, డ్వాక్రా ఏపీఎం అనీల్‌కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

పింఛను సొమ్ము పెంచాలి

మండపేట: దివ్యాంగులకు పింఛను సాయాన్ని రూ.ఆరు వేలకు పెంచాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నేత దూలి జయరాజు కోరారు. శుక్రవారం స్థానిక దివ్యాంగుల భవనం వద్ద వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ నబీ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌ను పెంచడంతో పాటు 35 కిలోల బియ్యాన్ని అందజేయాలన్నారు. అనంతరం ఒకటో వార్డు దివ్యాంగుల కమిటీ ఎన్నికలో అధ్యక్షుడిగా చిలక రాజు, ప్రధాన కార్యదర్శిగా కంకిపాడు శ్రీను ఎన్నికయ్యారు. సంఘ నాయకులు కోటడి శివ, మేడిశెట్టి రాంబాబు, మాదిబోయిన ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వీడాలి



రాయవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈఓ కమలకుమారి

రాయవరం: విధి నిర్వహణలో ఉపాధ్యాయులు అలసత్వాన్ని వీడి మెరుగైన పనితీరు కనబర్చాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి సూచించారు. శుక్రవారం రాయవరం ఎంఆర్‌సీని సందర్శించిన ఆమె మాట్లాడారు. ముఖ్యంగా వర్క్‌బుక్స్‌ను ఎప్పటికప్పుడు విద్యార్థులతో రాయించాలని, ఉపాధ్యాయులు తప్పనిసరిగా డైరీలు, లెసెన్ ప్లాన్స్ రాయాలన్నారు. బైజూస్ ట్యాబ్స్‌ను విద్యార్థులు వినియోగించే విధంగా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలన్నారు. 8వ తరగతి బోధించే ఉపాధ్యాయులు ట్యాబ్‌లను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. బైజూస్ కంటెంట్‌ను వినియోగించడం ద్వారా విద్యార్థులు విషయ పరిజ్ఞానం తెలుసుకోవడంతో పాటు ఉపాధ్యాయుల బోధన పద్ధతులను మెరుగుపర్చుకునేందుకు వీలవుతుందన్నారు. అనంతరం ఆమె రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాల అభివృద్ధి చెందిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. డీవైఈఓ షాలెంరాజు, ఎంఈఓ వై.సత్యనారాయణ, సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎల్‌ఎస్‌ఈఓ డి.రమేష్‌బాబు, ఏఏంఓ రాంబాబు, అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ ఎం.సత్యనారాయణ, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అఖండ భగవన్నామ సంకీర్తన



జిల్లాస్థాయి భజన పోటీల్లో ప్రథమ స్థానం పొందిన సతార్ స్వామికి ట్రోఫీని అందజేస్తున్న నాగేశ్వరరావు మాస్టారు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అఖండ భగవన్నామ సంకీర్తన(సప్తాహం) శుక్రవారంతో ముగిసింది. వేట్లపాలేనికి చెందిన ఆధ్యాత్మిక గురువు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సప్తాహంలో పలు జిల్లాల నుంచి 84 భజన బృందాలు పాల్గొన్నాయి. చివరి రోజైన శుక్రవారం వీటిలో మూడు ఉత్తమ బృందాలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో వెంటూరుకి చెందిన లక్ష్మీగణపతి భజన సమాజం, ద్వితీయ స్థానంలో వేగాయమ్మపేటకు చెందిన శివశక్తి మహిళా సమాజం, తృతీయ స్థానంలో పల్లిపాలేనికి చెందిన సీతారామాంజనేయ మహిళా సమాజం బృందాలు నిలిచాయి. గత నెలలో వేట్లపాలెంలో జరిగిన జిల్లా స్థాయి భజన పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన ద్రాక్షారామకు చెందిన కైరం వీరవెంకట సత్యనారాయణ(సతార్ స్వామి) ఆధ్వర్యంలోని అయ్యప్ప భక్తి రంజని బృందానికి పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ట్రోఫీని అందజేశారు.

కల్యాణం.. కమనీయం



భవానీ శంకరస్వామి దివ్య కల్యాణం జరిపిస్తున్న పండితులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్లలో వేంచేసిన బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామా సమేత గోపాలస్వామి, శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామివార్ల దివ్య కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. రావూరి వెంకటనారాయణ, అంగర విజయ వెంకట సూర్యనారాయణాచార్యులు బ్రహ్మత్వంలో పండితులు కన్నుల పండువగా కల్యాణం జరిపారు. ఆలయ ఈఓ ఎంవీవీ సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నరసాపురపుపేట వేంచేసిన పార్వతీ సమేత భవానీశంకరస్వామి దివ్య కల్యాణం రాత్రి 8 గంటలకు చెరుకుపల్లి గణేష్ శర్మ, మద్దిరాల శ్రీనివాస దత్తు బ్రహ్మత్వంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ కొప్పిశెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ



సోషల్‌మీడియా కన్వీనర్ నరేష్‌కు సత్కరించిన నాయకులు

రామచంద్రపురం రూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వెలంపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎంపికైన పెదపట్నపు నరేష్‌కుమార్, ద్రాక్షారామ, వెలంపాలెం సచివాలయాలకు అబ్జర్వర్‌గా ఎంపికైన పెంటపాటి శ్రీనివాస్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్, ఏపీసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.